ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేది: 10.04.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ పెంచుతున్నట్లు రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. పెరిగిన డీఏ ఈ ఏడాది జనవరి 1 నుంచి వర్తిస్తుందని తెలిపారు.

2. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మూడు బ్యారేజీల మరమ్మతులను వేగవంతం చేసి, వాటిని త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

3. హైదరాబాద్ కమిషరేట్ పరిధిలో రౌడీషీటర్లకు, నిర్వహిస్తున్న డ్రగ్స్ టెస్టుల్లో సుమారు 190 మందికి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

4. ప్రజా ప్రభుత్వం వైద్య రంగానికి అధిక నిధులు కేటాయిస్తోందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు.

5. హైదరాబాద్ - విజయవాడ నగరాల మధ్య 'ఫ్లై 91' విమాన సర్వీసును కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు.

కరువు భత్యం (డీఏ)

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరటనిస్తూ 2.1 శాతం కరువు భత్యం (డీఏ) పెంచుతున్నట్లు రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. తాజా పెంపుతో ప్రస్తుతం ఉన్న 50.7 శాతం డీఏ కాస్తా 52.8 శాతానికి చేరుకుంది. ఈ కొత్త నిబంధన ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరం నుంచే అమలులోకి రానుంది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ...

బైట్ ... పొన్నం ప్రభాకర్

పిటిసి, హైదరాబాద్

**జూపల్లి కృష్ణారావు**

రాష్ట్రంలోని అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు భరోసా ఇచ్చారు. పెద్ద కొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు

పత్రాలను అందజేయడంతో పాటు పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, గూడు లేని పేదలకు అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో ప్రజలను వంచించిందని విమర్శించిన మంత్రి, తమ హయాంలో పారదర్శకంగా ఇళ్ల నిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు.

పిటిసి, నాగర్ కర్నూల్

**రేవంత్ రెడ్డి**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మూడు బ్యారేజీల మరమ్మతులను వేగవంతం చేసి, వాటిని త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రాజెక్టు పునరుద్ధరణపై ఆయన కీలక సూచనలు చేశారు. జాతీయ ఆనకట్టల భద్రత పర్యవేక్షణ సంస్థ (ఎన్డీఎస్ఏ) మార్గదర్శకాలను పాటిస్తూ, ప్రత్యేక కార్యాచరణ ద్వారా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభానికి ముందే సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణ ప్రక్రియను ముగించాలని అధికారులకు సూచించారు. బ్యారేజీల భద్రత విషయంలో నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్న ముఖ్యమంత్రి, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పునరుద్ధరణ ద్వారా రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

డెస్క్

**కల్వకుంట్ల కవిత**

కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. రెండున్నరేళ్లు దారుణంగా వ్యవహరించి పంటలు ఎండబెట్టారని ఆమె ఆరోపించారు. హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ… కమీషన్ల కోసమే ఇప్పుడు కాళేశ్వరానికి మరమ్మతులు అంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్, అర్బన్ ఫారెస్ట్రీలో తీవ్రమైన అవినీతి జరుగుతోందన్నారు. రియల్ ఎస్టేట్ కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్‌కు నష్టం చేయవద్దని కోరారు.

డెస్క్

**రౌడీషీటర్లకు డ్రగ్ టెస్టులు**

హైదరాబాద్ కమిషరేట్ పరిధిలో రౌడీషీటర్ల ఆగడాలు పెరగడంతో పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. సీపీ సజ్జనార్ ఆదేశాలతో రౌడీ షీటర్లకు డ్రగ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. నగరంలో ప్రస్తుతం 1,300 మందికి పైగా రౌడీషీటర్లు ఉన్నారు. వారిలో 250 మందికి పైగా డ్రగ్ టెస్టులు నిర్వహించారు. 190 మందికి గంజాయి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు నిర్ధరించారు. ఈ క్రమంలో గంజాయి సరఫరాదారులపై కఠిన చర్యలు చేపట్టనున్నారు.

డెస్క్

సీతక్క

రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ప్రజా ప్రభుత్వం వైద్య రంగానికి అధిక నిధులు కేటాయిస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ములుగు జిల్లాను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆమె చెప్పారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా కేంద్రంలోని బంజారా భవన్లో కలెక్టర్ దివాకర్ అధ్యక్షతన జరిగిన ప్రపంచ హోమియోపతి, ఆయుష్ దినోత్సవాల సందర్భంగా నిర్వహించిన యోగా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. యోగా సాధన వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ దీనిని నిత్యకృత్యం చేసుకోవాలని సూచించారు.

పిటిసి, ములుగు

**ప్రపంచ హోమియోపతి దినోత్సవం**

ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈరోజు ఆరోగ్య అంశంపై అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఈరోజు హోమియోపతి దినోత్సవం సందర్భంగా వివిధ జిల్లాల్లో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం అన్నారు. 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక', 'తెలంగాణ రైజింగ్ 2047' కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు ఆదిలాబాద్ పట్టణంలో ప్రపంచ హోమియోపతి దినోత్సవం సందర్భంగా 'హెల్త్ వీక్' వేడుకలలో యోగా శిబిరం నిర్వహించారు.

ఆసిఫాబాద్ కలెక్టరేట్ లో ప్రపంచ హోమియో దినోత్సవం పురస్కరించుకొని యోగా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుందని నిత్యం ఒక గంట పాటు యోగా చేసినట్లైతే శరీరం ఆరోగ్యంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు.
యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో యోగా సాధనను అలవాటు చేసుకోవాలని జనగామ జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున రావు సూచించారు.

పిటిసి, నిర్మల్, ఆసిఫాబాద్, జనగామ

**దామోదర్ రాజనర్సింహ**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా గచ్చిబౌళి స్టేడియంలో నిర్వహించిన యోగా సెషన్స్ ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి యోగా చేసిన అనంతరం ఆయుష్ విభాగానికి చెందిన స్టాల్స్ ను వారు పరిశీలించారు. వరల్డ్ హోమియోపతి డే సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, నివారణే మేలనే నినాదంతో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి

డెస్క్

**'ఫ్లై 91' విమాన సర్వీస్**

విజయవాడ, హైదరాబాద్ నగరాల మధ్య ప్రయాణించే వారికి విమానయాన సేవలు మరింత చేరువయ్యాయి. తాజాగా 'ఫ్లై 91' విమాన సర్వీసును కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ఉడాన్ పథకం కింద అభివృద్ధి చెందుతున్న ఈ సంస్థ, ఈ నెల 17 నుంచి హైదరాబాద్ కేంద్రంగా 22 రాకపోకలను నిర్వహించనుంది. త్వరలోనే దుబాయ్, వారణాసి, కొచ్చి వంటి నగరాలకు కూడా సర్వీసులను విస్తరించనున్నట్లు మంత్రి ప్రకటించారు. మరోవైపు విశాఖపట్నంలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు జూన్ నాటికి పూర్తవుతాయని, జూలైలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా దీనిని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

డెస్క్

**దీక్ష విరమణ**

వనపర్తి జిల్లా, గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా 102 రోజులుగా దీక్ష చేస్తున్న రైతులకు మాజీ మంత్రి హరీష్ రావు మద్దతు తెలిపి, నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. కమీషన్ల కోసం ప్రభుత్వం ప్రజాధనాన్ని వృధా చేస్తూ రైతుల పొట్ట కొట్టవద్దని ఆయన హితవు పలికారు.

పిటిసి, వనపర్తి

**అడ్లూరి లక్ష్మణ్**

రబీ సీజన్‌లో మొక్కజొన్న రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి క్వింటాలుకు 2,400 రూపాయల మద్దతు ధర అందించేందుకు చర్యలు తీసుకుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

బైట్ ... అడ్లూరి లక్ష్మణ్

పిటిసి, జగిత్యాల